1 JUL 2018

# రాష్ట్ర ప్రతిపత్తితోనే సమస్యల పరిష్కారం

యానాం, న్యూస్‌టుడే: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తి వస్తేనే అన్ని సమస్యలు, సంక్షోభాలు పరిష్కారమవుతాయని ప్రభుత్వ విప్ ఆర్‌కేఆర్ అనంతరామన్ పేర్కొన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీలో బడ్జెట్ సమర్పణపై చర్చ ముగిసిన అనంతరం రాష్ట్ర ప్రతిపత్తి అంశంపై వాడీవేడిగా చర్చ జరిగింది. ప్రతి నిర్ణయానికి కేంద్రం అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి వల్లే పుదుచ్చేరి సంక్షోభంలో చిక్కుకుందని, 70 శాతం రావాల్సిన కేంద్ర నిధులు 25 శాతమే వస్తున్నాయని అన్నారు. అవి రానురానూ 17కే పడిపోయే ప్రమాదం కనిపిస్తుందని అనంతరామన్ ఆందోళన వ్యక్తం చేశారు. పుదుచ్చేరికి ప్రత్యేక హోదా రాష్ట్రప్రతిపత్తి కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుందని ముఖ్యమంత్రి వి.నారాయణసామి స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తానని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారన్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్‌లు ప్రత్యేక హోదా కోరుతున్నప్పుడు విభిన్నమైన పరిస్థితిలో ఉన్న మనం కోరుకోవడంలో సబబేనన్నారు. పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తి విషయంలో తమ పార్టీ మద్దతిస్తుందని ఆలిండియా నమదురాజ్యం కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి సభలో స్పష్టం చేశారు. పుదుచ్చేరి ప్రస్తుత దుస్థితికి ఒక్కరినే కారణం చేయడం సరికాదన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలపై దిల్లీ సీఎం కేజ్రీవాల్ కేసు వేసినపుడు ప్రభుత్వం ఎందుకు కేసులో భాగస్వామి కాలేదని ప్రశ్నించారు. అక్కడ దిల్లీ ప్రభుత్వానికి అనుకూల నిర్ణయం వచ్చినా పుదుచ్చేరికి ఆ తీర్పు వర్తించదన్న భావన సర్వత్రా నెలకొని ఉందన్నారు. దిల్లీ వివాదం కేసుకు మద్దతుగా తాము కేసు దాఖలు చేయడానికి ప్రయత్నించినపుడు హైకోర్టులో కేసు వేశాకే తమ వద్దకు రావాలని సుప్రీంకోర్టు తెలిపిందని సభలో సీఎం నారాయణసామి వివరించారు. ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారని, దీనిపై మూడు వారాల్లో నిర్ణయం చెపుతామని న్యాయస్థానం బదులిచ్చిందన్నారు.

## అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే వాకౌట్

పుదుచ్చేరి ప్రభుత్వం ఇంటి పన్నులను పెంచడానికి నిరసనగా అన్నాడీఎంకే పార్టీ నేత ఎ.అన్బళగన్ సభలో చర్చ లేవనెత్తి సభ్యులతో వాకౌట్ చేశారు. దశలవారీగా పన్నులు పెంచాల్సింది పోయి ఒక్కసారిగా భారీ మొత్తం పెంచడం సరికాదన్నారు. దేశంలో ఒక్క పుదుచ్చేరిలోనే చెత్తపై పన్ను వసూలు చేస్తున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ అంశాలన్నింటిపైనా సమావేశాలు ముగిసేలోపు తగు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందక సభ నుంచి అన్నాడీఎంకే వాకౌట్ చేసింది.

# ప్రైవేట్ బోట్‌హౌస్‌కు అనుమతిపై అసెంబ్లీలో చర్చ

## అధికారపార్టీ సభ్యుడి వాకౌట్

యానాం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.ఎన్.ఆర్. బాలన్ వాకౌట్ చేయడం అధికార పార్టీని ఇరుకున పెట్టింది. చున్నంబార్ బోట్‌హౌస్‌కు సమీపంలో మరో ప్రైవేటు బోట్‌హౌస్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై పర్యాటకశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు వివరణ ఇవ్వాలని బాలన్ డిమాండ్ చేశారు. అడ్వంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచడానికే ప్రైవేటు బోట్‌హౌస్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అనుమతి ఇచ్చామని, వారు పాటించాల్సిన నిబంధనలు రూపొందించి న్యాయశాఖ అనుమతికి పంపామని మల్లాడికి బదులుగా ముఖ్యమంత్రి నారాయణసామి సమాధానమిచ్చారు. దానికి సంతృప్తి చెందని బాలన్ సభ నుంచి వాకౌట్ చేశారు. పర్యాటకశాఖలో అవినీతి జరుగుతోందంటూ గత ఏడాదీ బాలన్ ఇదేవిధంగా సొంతపార్టీ ప్రభుత్వంపైనే ఆరోపణలు గుప్పించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

# వైభవంగా మహాలక్ష్మమ్మ తీర్థం

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రజల గ్రామదేవత మహాలక్ష్మమ్మ తీర్థం మంగళవారం స్థానిక ద్రాక్షారామరోడ్డులోని ఆలయంలో వైభవంగా నిర్వహించారు. అనేకమంది భక్తులు ఇళ్లవద్ద నైవేద్యాలు, ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ సముదాయ కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, కార్యవర్గ సభ్యులు గంధం శంకరరావు, నాగేశ్వరరావు, కాదా వెంకటేశ్వరరావు, కొంకిపూడి గాంధీ ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం అక్కడ బాణసంచా కాల్చారు. ప్రత్యేకంగా మొక్కుకున్న భక్తులు నిప్పులగుండాన్ని తొక్కారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో రాత్రి ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. సీఐ గిడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

1 JUL 2018

# నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి- యానాం

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడికి రాసిన వినతిపత్రాన్ని యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవుళూరి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు మంగళవారం నిరుద్యోగులు అందించారు. పదేళ్ల నుంచి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ఉపాధిలేక కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. వారి ఆవేదన విన్న ఆర్‌ఎఒ దీనిపై అధికారులతో చర్చించి చర్యలు చేపడతామని తెలిపారు.

11 JUL 2018

# చెస్ పోటీ విజేతలు వీరే

**యానాం, జూలై 10**: స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న జోనల్ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా చెస్ పోటీలు మంగళవారం ముగిశాయి. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. 2018-19కి సంబంధించి అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లనుంచి 170మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. వీరిలో అండర్-14 బాలుర విభాగంలో యానాం పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానాన్ని, డ్రీమ్స్ ఫౌండేషన్ స్కూల్ ద్వితీయ స్థానాన్ని, అండర్-17 బాలుర విభాగంలో యానాం పబ్లిక్ స్కూల్, రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు వరుస స్థానాలలో నిలిచారు. అండర్-14 బాలికల విభాగంలో యానాం పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానాన్ని, వివేకానంద పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానాలను కైవశం చేసుకోగా, అండర్-17 బాలుర విభాగంలో డ్రీమ్స్ ఫౌండేషన్ స్కూల్, యానాం పబ్లిక్ స్కూల్ వరుస స్థానాలలో నిలిచారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పనాతి భాస్కర్, నక్కల సుబ్బన్న, పీఈటీ సీహెచ్.రామకృష్ణ, పాము సత్యనారాయణ, కె.రమేష్, ఐవీకే మోహన్, చంద్రశేఖర్, సన్యాసిరావు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెస్ పోటీలను వీక్షిస్తున్న ప్రధానోపాధ్యాయులు

# ఘనంగా మహాలక్ష్మమ్మ అమ్మవారి తీర్థం

**యానాం, జూలై 10:** యానాం గ్రామదేవత మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. యానాం వెంకటేశ్వర దేవస్థానం ఆలయ సముదాయ కమిటీ, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ జాతర మహోత్సవాలలో ఆదివారం చిన్నజాతర, సోమవారం పెద్దజాతర, మంగళవారం తీర్థం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు మొక్కలు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిప్పుల గుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ, పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది.

# రాజీవ్‌గాంధీ బీచ్‌లో మేకల పాలవుతున్న మొక్కలు

**యానాం, జులై 10:** రాజీవ్‌గాంధీ బీచ్‌లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పర్యాటక అందాలకు బీటలు వారుతున్నాయి. బీచ్ పొడవునా వేసిన మొక్కలు వర్షాలకు ఇప్పుడిప్పుడే చిగురిస్తున్న తరుణంలో వాటిని కూడా మేకలు నెమరేస్తున్నాయి. బీచ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న యానాం ప్రాంతానికి పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల శివం హోలిబాత్‌పై ఉన్న ఏనుగు ఒక కాలు విరిగి పడిపోవడంతో కళావిహీనంగా తయారైంది. దానికి తోడు ఉన్న మొక్కలు కూడా ఇలా మేకల పాలు చేస్తుంటే పర్యాటకుల నిరాశ మిగలనుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



11 JUL 2018

## స్టేట్‌హుడ్ ద్వారానే సమస్యలను పరిష్కారం

**యానాంప్రభన్యూస్:** పుదుచ్చేరికి స్టేట్ హుడ్ ద్వారానే ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం లభిస్తుందని సిఎం .నారాయణస్వామి తెలిపారు.మంగళవారం అసెంబ్లీబడ్జెట్ సమావేశాలు సందర్భంగామాట్లాడారు. మెజారిటి ఎమ్మెల్యే లుస్పెషల్ కేటగిరి స్టేటస్ కన్నా స్టే ట్ హుడ్ కే అనుకూలంగా వున్నారని అన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ,బీహార్ రాష్ట్రాలు స్పెషల్ కేటగిరి స్టేటస్‌ను అడుగుతున్నా రని ఈనేపధ్యంలో స్టేట్ హుడ్‌పైనే అంతా ఇష్ట పడుతూ అభిప్రాయాలు చెప్పారని ఇవేమి తన యెక్క వ్యక్తిగతఅభిప్రాయంకాదని స్పష్టంచేసారు. అయితే మాజీ సీఎం రంగసామి ,ఎఐఎడిఎంకె ఎమ్మెల్యే అన్నళగన్ మాట్లాడుతూ స్పెషల్ కేటగిరిస్టేటస్ వల్లేఎక్కుకున్న ప్రభుత్వానికి అదికారాలు వస్తాయని అన్నారు. ఎల్జీ బేడి అడ్డంకులు సృష్టిస్తుండటంతో పదకాలు అలస్యమవుతున్నాయని పైల్స్ ను వెనకకు పంపించి వేస్తున్నా రన్నారు.

11 JUL 2018

## ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



యానాం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారు



యానాం,జూలై10,ప్రభాతవార్త:

యానాం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. యానాం వెంకటేశ్వర దేవస్థాన అలయ సముదాయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా స్థానిక ఆలయం వద్ద తీర్థంను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తుల పూజలతో ఆలయం సందడిగా మారింది. అధికసంఖ్యంలో మహిళలు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు

తీర్థం సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ప్రసాదంను పంపిణీ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు నిప్పులగుండం నిర్వహించారు. ప్రజలు, భక్తజనం తిలకించారు. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. ఆలయ పూజారులు, ఆసాదులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.